క్లుప్తంగా

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్ని ప్రమాదాల గురించి వివరిస్తున్న సిబ్బంది

తగరపువలస: చిట్టివలస అగ్నిమాపక కేంద్రంలో వారం రోజులు జరిగిన అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ప్రజలకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వారం రోజుల భీమిలి నియోజకవర్గంలోని వివిధ కూడళ్లు, పెట్రోల్ బంకులు, విద్యాసంస్థలు, సినిమా థియేటర్లలో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై కరపత్రాలు పంపిణీ చేశారు.

95 మందికి హోమియో మందుల అందజేత



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టీజే మోహన్ 95 మంది రోగులను పరీక్షించి వారికి మందులను అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.చంద్రశేఖరరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు ఎం.శంకర్, రాము, కిశోర్, లక్ష్మణ్, గోవింద్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

70 మందికి కంటి పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

పద్మనాభం: సత్య సాయి బాబా 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా విశాఖ జోన్, పద్మనాభం సత్యసాయి భజన మండలి సంయుక్తంగా ఆదివారం పద్మనాభం గ్రామంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 25 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యురాలు కుమారి శాంతి ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి విశాఖ జోనల్ కో–ఆర్డినేటర్ ఎం.వి.సత్య సాయి కుమార్, జోనల్ యూత్ కో–ఆర్డినేటర్ శరత్ కుమార్, క్యాంప్ కో–ఆర్డినేటర్ వై.పైడిరాజు, పద్మనాభం భజన మండలి సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఆర్.సన్యాసిరావు, ప్రతినిధులు కె.ఎర్నాయుడు, ఎం.వి.రమణ పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యాపారాలతో ట్రాఫిక్ సమస్యలు



సాగర్‌నగర్ వద్ద రోడ్డుమీదే పార్కింగ్ చేసిన వాహనాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో రోడ్డు పక్కన ఇష్టానుసారంగా బడ్డీలు వెలుస్తున్నాయి. ప్రధాన రహదారిని ఆనుకుని ఈ దుకాణాలు ఏర్పాటు చేయడంతో నిత్యం పార్కింగ్ సమస్య తీవ్రమవుతోంది. టిఫిన్ సెంటర్లు, మెకానిక్ షెడ్లు, పాన్ షాపులు వంటివి ఎటువంటి అనుమతులు లేకుండా రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేయడం వల్ల వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. ఫలితంగా, ఈ ప్రాంతంలో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఈ ఆక్రమణలను అరికట్టాలని సాగర్‌నగర్ స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆనందపురం ఫ్లై ఓవర్‌పై ఎండలో ప్రయాణికుల పాట్లు

నిలువ నీడ కరువు



వేములవలస కూడలిలో **నిరుపయోగంగా** బస్ షెల్టర్

తగరపువలస: ఆనందపురం **మండల కేంద్రమైన** వేములవలసలో నిత్యం వందలాది మంది ప్రయాణికులు మండే ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వేములవలస కూడలితో పాటు ఫ్లై ఓవర్‌పై నిర్మించిన బస్ షెల్టర్లు ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉండేవి. పెందుర్తి నుంచి ఆనందపురం మీదుగా తగరపువలస వైపు జాతీయరహదారి విస్తరణ తరువాత ఈ షెల్టర్లు నిరుపయోగంగా మారిపోయాయి. మండలంలోని సుమారు 16 పంచాయతీల ప్రయాణికులు, వ్యాపారులు, విద్యార్థులు వేములవలస కూడలి వద్దే బస్సులను ఎక్కేవారు. రహదారుల విస్తరణ తరువాత అవసరమైన చోట షెల్టర్లు నిర్మించవలసి ఉన్నా హైవే, ఆర్టీసీ, స్థానిక ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో వేములవలస మార్కెట్‌ను ఆనుకుని ఫ్లై ఓవర్ కిందే ప్రమాదకరమని తెలిసినా బస్సుల కోసం నిత్యం వందల సంఖ్యలో వేచి ఉంటున్నారు.

అవసరం లేని చోట నిర్మించారు

పెందుర్తి నుంచి ఆనందపురం వరకు జాతీయరహదారికి ఇరువైపులా నిర్మించిన బస్ షెల్టర్లు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఇవి గ్రామాలు ఉన్నచోట కాకుండా దూరంగా నిర్మించిన అతి చిన్న షెల్టర్లు వర్షాలు, ఎండల నుంచి రక్షణ ఇవ్వడం లేదు. దీంతో ఇవి చీమల పుట్టలతోను, డంపింగ్ యార్డుల గాను మారిపోయాయి. అలాగే ఆనందపురం నుంచి తగరపువలస వైపు పెద్దిపాలెం, వెల్లంకి తదితర పంచాయతీలలో కనీసం షెల్టర్ ఊసే **లేదు. ఈ కారణంగా ఈ ప్రాంత** ప్రయాణికులు బస్సులు వచ్చే వరకు దుకాణాలు, చెట్లు కింద తలదాచుకుంటున్నారు. అలాగే భీమిలి మండల పరిధిలో జాతీయరహదారిని ఆనుకుని తాళ్లవలస, దాకమర్రి, బోడమెట్టపాలెం, టి.నగరపాలెం, ముద్దాడపేట గ్రామాల వద్ద కూడా బస్ షెల్టర్లు అవసరమైన చోట కనిపించవు.



వేములవలస ఫ్లై ఓవర్ కిందే ప్రయాణికుల పాట్లు

ఎండా కాలంలో తీవ్రమైన సమస్య



ప్రస్తుతం ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. బయటకు రావాలంటేనే జనం హడలిపోతున్నారు. ఇలాంటి సమయంలో బస్సుల కోసం గంటలకొద్దీ కూడళ్లలో వేచి ఉండాలంటే ఎంత ఇబ్బంది పడుతున్నామో అధికారులు ఆలోచించాలి.

–కాళ్ల గౌరి, కుసులవాడ

ప్రణాళిక లేకుండా



ప్రయాణికులు ఒకవైపు ఇబ్బంది పడుతుంటే కనీసం అధికారులు అవసరమైన చోట బస్ షెల్టర్లు నిర్మించాలన్న ఆలోచన కూడా చేసినట్టు కనిపించడం లేదు. బస్ షెల్టర్లు ప్రయాణికులకు కనీస అవసరంగా గుర్తించాలి.

–ఇల్లపు వెంకటరావు, వెంకటాపురం

పూర్వమే నయం..



గతంలో వేములవలస కూడలిలో బస్సుల రాకపోకలకు వీలుగా హైవేపై పెద్ద షెల్టర్ ఉండేది. ప్రయాణికులు వేచి ఉండటానికి బెంచీలు ఉండేవి. ఇప్పుడు ఎండైనా, వానైనా, దుమ్ము, దూళిలో రోడ్డు పక్కనే గంటల కొద్దీ నిలబడి ఉండవలసి వస్తుంది.

–దుద్దుపూడి వెంకటరావు, పొడుగుపాలెం

ఫ్లై ఓవర్ లేకపోతే..



గుడ్డి కంటే మెల్ల నయం అన్నట్టు వేములవలస కూడలిలో ఫ్లై ఓవరే లేకపోతే ప్రయాణికులు ఎండలో మాడిపోయేవారు. అయినా దీని కింద వేచి ఉండటం శ్రేయస్కరం కాదు. ముఖ్యమైన మార్గాలలోని కూడళ్లలో తక్షణం షెల్టర్లు నిర్మించాలి.

– లంకలపల్లి గోపి, ఆనందపురం

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం



గొల్లల తాళ్లవలసలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధానందుని శిష్యులు

తగరపువలస : ప్రబోధ సేవాసమితి , ఇందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భీమిలి మండలం గొల్లల తాళ్లవలస, బిల్లల మెట్ట ప్రాంతాలలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ, ప్రబోధానందుడు 100 రకాల త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను రచించారని తెలిపారు. శ్రీరామ అనే పదానికి అర్థం వివరిస్తూ, కృతయుగం నుంచి మోక్షాన్ని కోరుకునే జ్ఞాన జిజ్ఞాసులు ఆ నామాన్ని పలికేవారన్నారు. త్రేతాయుగంలో శ్రీరాముని పేరులోని గొప్ప భావం మరింత ప్రాచుర్యం పొందిందని ఆయన వివరించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కె.సురేష్, వి.భవాని, నరసయ్యమ్మ, కె.రాజు, కె.సంతోష్, లక్ష్మి, కె.సత్యం, బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీడం కప్ విజేత ఆర్‌బీటీ జట్టు



విజేత జట్టుకు కప్‌ను అందిస్తున్న శ్రీనివాసరావు, నరేంద్రకుమార్

భీమునిపట్నం : స్థానిక వుడా మైదానంలో అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్(ఏబీసీ) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఫ్రీడం కప్ ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ బెంగాల్ టైగర్స్ (ఆర్‌బీటీ) జట్టు విజయం సాధించింది. నియోజకవర్గ స్థాయిలో రౌండ్ రాబిన్ పద్ధతిలో నెల రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో 14 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్స్‌లో వలందపేటకు చెందిన ఫాల్కన్స్ జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 120 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సంగివలస రాయల్ బెంగాల్ టైగర్స్(ఆర్‌బీటీ) జట్టు 17 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని అందుకుంది.

విజేత జట్టు ఆర్‌బీటీకి ఏబీసీ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్‌లు కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అడిదం అంజనీకుమార్ , సభ్యులు లోవరాజు, రాము, మహేష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా పునరుత్థాన వేడుకలు



భీమిలి రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న జీవం గల దేవుని సంఘం సభ్యులు

తగరపువలస: భీమిలి పరిధిలో ఆదివారం క్రైస్తవేతర పునరుత్థాన వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మృతి చెందిన తమ పితృదేవతలు సమాధుల నుంచి తిరిగి వస్తారనే విశ్వాసంతో క్రైస్తవులు ఉదయాన్నే సమాధులకు చేరుకున్నారు. అక్కడ వారు సమాధులను పువ్వులతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిలలో తమ పూర్వీకులను స్మరించుకుంటూ పాటలు పాడారు. కొండపేట, చిట్టివలసలోని సమాధుల వద్ద మధ్యాహ్నం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు తమ పూర్వీకుల సమాధులను సందర్శించారు. కొండపేట జీవం గల దేవుని సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది కొండపేట చర్చి నుండి భీమిలి రోడ్డులోని చెరువు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పి. ఆంథోని, రూత్ ఆంథోనిలు మాట్లాడుతూ, యేసుక్రీస్తు మూడో రోజున తిరిగి లేచి ప్రజలకు శాంతి, సమాధానం, రక్షణను ప్రసాదించారని తెలిపారు. ఆయన చూపిన సహనం, ప్రేమను ప్రపంచానికి చాటి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జ్యోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం బుజ్జి గణపతి నృత్యాంశంతో ప్రారంభమైంది. జై జనార్ధన, ఐగిరి నందిని నృత్య రూపకాలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదిగో అల్లదిగో, ముద్దుగారే యశోద వంటి అన్నమయ్య కీర్తనలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పవిత్ర, మోక్షజ్ఞాన, లక్ష్మీప్రణతి, జాస్మిక, గాతామిత్ర తదితర కళాకారులు పాల్గొన్నారు. మురళీగోవింద్ నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఏఓ రమణ పర్యవేక్షించారు.

టింబర్ డిపోలకు తరలిపోతున్న అటవీ కలప



కొమ్మాది జంక్షన్ వద్ద కలపతో వెళుతున్న వాహనం

మధురవాడ: కంబాలకొండ రిజర్వ్ ఫారెస్ట్, పరిసర ప్రాంతాల నుంచి విలువైన కలప అక్రమంగా టింబర్ డిపోలకు తరలిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత కొద్ది నెలలుగా ఈ అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగుతోంది. అక్రమార్కులు చీకటి పడిన సమయాన్ని ఆసరాగా చేసుకుని హైవే రోడ్డు గుండా కంబాలకొండ రిజర్వ్ ఫారెస్ట్, ప్రభుత్వ, ఇతర భూములలో అనుమతులు లేకుండానే భారీ వృక్షాలను నరికి తరలిస్తున్నారు. టేకు, వేప, మామిడి వంటి విలువైన కలపను వారు ఇష్టానుసారంగా తరలిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ రవాణాకు కొన్ని టింబర్ డిపోల యజమానులు, వడ్రంగి పనిలో ఉన్న వ్యక్తులు సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, కొన్ని టింబర్ డిపోలలో అనుమతికి మించి కలపను నిల్వ ఉంచుతున్నారని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగవేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు విషయంపై దృష్టి సారించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

భీమిలి తీరంలో రంగు తెప్పల సందడి





తీరానికి వస్తున్న రంగుల తెరచాప తెప్పలు

భీమునిపట్నం: భీమిలి తీరం ఆధునిక మత్స్యకార పడవలతో సందడిగా ఉన్నప్పటికీ, తెడ్ల సాయంతో తెప్పలపై చేపల వేట సాగించే మత్స్యకారులు ఇప్పటికీ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. గతంలో పడవలు, తెప్పలు ప్రధాన వేట సాధనాలుగా ఉన్న సమయంలో, మత్స్యకారులు తెడ్ల సాయంతోనే సముద్రంలోకి వెళ్లి తిరిగి వచ్చేవారు. ఆ సంప్రదాయ ఆనవాళ్లు నేటికీ భీమిలి తీరంలో కనిపిస్తున్నాయి. యాంత్రిక బోట్లపై ప్రస్తుతం వేట నిషేధం అమల్లో ఉన్నప్పటికీ, తెప్పలతో వేటాడే వారికి ఈ నిబంధన వర్తించదు. దీంతో చాలా మంది మత్స్యకారులు తమ జీవనోపాధి కోసం ఇప్పటికీ తెప్పలనే నమ్ముకున్నారు. ఒక్కో తెప్పకు ఒక్కో రంగు తెరచాప ఉండటం తీరానికి ప్రత్యేకమైన అందాన్నిస్తుంది. సముద్రపు నీలి రంగు నేపథ్యంలో ఈ రంగుల తెరచాపలు కనువిందు చేస్తున్నాయి.

దివ్యాంగుడి ఆత్మహత్య

పీఎం పాలెం: పీఎం పాలెం సెకండ్ బస్టాప్ సమీపంలోని తిరుమల అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో నివసిస్తున్న దివ్యాంగుడు నియమాన సుభాష్ చంద్రబోస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పీఎం పాలెం సీఐ బాలకృష్ణ మీడియాకు తెలిపారు. సుభాష్ చంద్రబోస్ తండ్రి 2023లో మృతి చెందగా, తల్లి, సోదరుడు కూడా గతంలో చనిపోయారు. దీంతో చంద్రబోస్ ఒంటరిగా జీవిస్తున్నారు. సుభాష్ చంద్రబోస్‌కు శ్రీకాకుళానికి చెందిన ధనుంజయరావు అనే స్నేహితుడు ఉన్నాడు. వారిద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఆదివారం ఉదయం ధనుంజయరావు సుభాష్ చంద్రబోస్‌కు ఫోన్ చేయగా, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. ఎంత ప్రయత్నించినా ఫోన్ కలవకపోవడంతో అపార్ట్‌మెంట్ ఓనర్‌కు సమాచారం అందించాడు. అపార్ట్‌మెంట్ ఓనర్ వాచ్‌మన్‌కు తెలియజేయగా, ఆదివారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో కొంతమంది అపార్ట్‌మెంట్ వాసులు బలవంతంగా తలుపులు తెరిచి చూడగా, సుభాష్ చంద్రబోస్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో మృతుడు గతంలో కూడా ఆత్మహత్యా ప్రయత్నం చేశాడని తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుని స్నేహితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగుతో ఇబ్బందులు



అపార్ట్ మెంట్ పక్కనే నిలిచిపోయిన మురుగునీరు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెం చెరువు పక్కనే ఉన్న వార్డు సచివాలయం వద్ద ఏర్పడిన పెద్ద మురుగు గుంట ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఆశగా వచ్చే సచివాలయం వద్దనే ఇలాంటి దుస్థితి నెలకొనడం విచారకరం. ఇక్కడ పనిచేస్తున్న సచివాలయ సిబ్బందికి ఇది సాధారణ విషయంగా అనిపిస్తున్నప్పటికీ, వివిధ పనుల నిమిత్తం వచ్చే సందర్శకులు, సమీప నివాసాల వారు మాత్రం దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఎగువ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌ల నుంచి వచ్చే మురుగు లోతట్టు ప్రాంతమైన సచివాలయం వద్ద నిలిచిపోతోంది. నెలల తరబడి ముగురు నిల్వ ఉండటంతో ఈ ప్రాంతం పందులు, పశువులు, ఈగలు, దోమలకు నిలయంగా మారింది. సంబంధిత అపార్ట్‌మెంట్ వాసులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మురుగు నీరు వెళ్లే మార్గాలను పరిశీలించకుండానే ఆక్యుపెన్సీ, ఇతర అనుమతులు మంజూరు చేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య గంగారాం ఆధ్వర్యంలో స్థానికులు పలుమార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, వాటిని పట్టించుకోలేదని వారు వాపోతున్నారు.



సచివాలయం ముందు మురుగు

ఆయుధంతో బెదిరించి చైన్ స్నాచింగ్



బాధితుడు బుట్టాన త్రినాథరావు

మధురవాడ: విశాఖ నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని పీఎంపాలెం ప్రాంతంలో నేరాలు పెరుగుతుండగా, తాజాగా కొమ్మాదిలో శనివారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. కిరాణా దుకాణం మూసివేస్తున్న బొట్టాన త్రినాథరావు మెడలోని రెండు తులాల బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తి ఆయుధంతో బెదిరించి లాక్కెళ్లాడు. బాధితుడు ప్రతిఘటించబోగా దొంగ బెదిరించడంతో భయపడ్డాడు. అనంతరం మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై డ్రైవర్స్ కాలనీ వైపు పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుండగుడు చూపించిన ఆయుధం తుపాకీలా ఉందని బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు క్రైం ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

డ్రెయినేజీల్లో పూడికతీత పనులు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ పరిధిలోని వలందపేటలో డ్రెయినేజీ సమస్యలపై 'సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు వెలువడిన నేపథ్యంలో, పంచాయతీ కార్యదర్శి వైవీ రామకృష్ణ స్పందించారు. డ్రెయినేజీలలో పూడికతీత పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 8న 'అంతిమయాత్రకు అవస్థలెన్నో..', 14న 'కాలుష్య కాసారంగా గెడ్డలు', 16న వలందపేటలో 'పారిశుద్ధ్యం అధ్వానం' శీర్షికలతో 'సాక్షి'లో వరుసగా వచ్చిన కథనాలపై స్పందించారు. వలందపేట ప్రాంతం తాళ్లవలస పంచాయతీ, జీవీఎంసీ భీమిలి జోన్ మధ్య బఫర్ జోన్‌లో ఉన్నప్పటికీ, డీపీవో ఎంపీడీ శ్రీనివాసరావు సూచనల మేరకు పంచాయతీ యంత్రాంగం వెంటనే స్పందించిందని ఆయన వివరించారు. శనివారం జేసీబీ సహాయంతో మురుగునీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న పూడికలను తొలగించినట్లు కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.

ప్రయోజనకరంగా పరిశోధనలు

విశాఖ విద్య: పరిశోధనలు సమాజానికి మేలు చేసేలా యూనివర్సిటీ ఆచార్యులు, విద్యార్థులు మరింత సాధన చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని టికె జయరక్షితకు ఏయూ డాక్టరేట్ లభించింది. వీసీ చేతుల మీదుగా ఆమె పీహెచ్‌డీ పట్టా పొందారు. 'ఏ హోలిస్టిక్ అనాలసిస్ ఆఫ్ బనానా ఫైబర్–రీన్ ఫోర్స్‌డ్ సస్టైనబుల్ కాంక్రీట్ ఆఫ్ ఎం 25, అండ్ ఎం 35' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ ఆచార్య ఎస్.ఆదిశేషు పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆదివారం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయ రక్షితను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.